# ఎస్.ఎం.ఎస్. ప్రేమ

- నామని సుజనాదేవి



గేట్ పడుతుందేమోనని హడావుడిగా తొందర పడుతూ వచ్చినా, వచ్చేసరికి రైల్వేగేట్ పడటంతో చికాగ్గా, తనను తాను తిట్టుకుంది భావన. అసలే ఈ రోజు ఆఫీస్‌లో 'ఆడిట్' అని త్వరగానే బయల్దేరింది. కాని దారిలో, ఇద్దరు చిన్న స్కూలు పిల్లలు ట్రాఫిక్‌లో రోడ్డు దాటడానికి కష్టపడుతుంటే, చూస్తూ తన దారిన తాను రాలేక, వారిని మరో వృద్ధుడిని రోడ్డు దాటించేసరికి ఆలస్యమయింది. ఈలోగా రైల్వేగేట్ మూసేస్తారని ఎంత భయపడిందో అంతా అయింది. రైలు వచ్చేసరికి ఆలస్యమవుతుందేమో వెళదామనుకుని, గేట్ క్రింది నుండి నెమ్మదిగా దూరి, తన స్కూటీని కూడా కొంచెం వంచి తీసింది. అక్కడ రెండు ట్రాక్‌లున్నాయి. ఒక ట్రాక్ మీదకు బండిని తీస్కెళ్ళేసరికి రైలు కూత వినబడింది. ఉలిక్కిపడి అటువైపు చూసింది భావన. తాను నిల్చున్న ట్రాక్ పైకికాక, ప్రక్కనున్న ట్రాక్ పైకి రైలు వస్తోంది. దాంతో అదెళ్ళిపోగానే వెళ్ళడానికి ఆతృతగా వెహికిల్‌ను పట్టుకుని వస్తున్న రైలువైపే చూస్తూ నిల్చుంది. అయితే ఇంతలో ఆమె నిల్చున్న పట్టాపైకి, ఇటువైపునుండి మరో రైలు వస్తోంది. ఆ రైలు కూత వేసింది. కాని ఆ శబ్దం మొదటి రైలు కూతలో కలిసిపోయింది. ఎవరైనా ముందు వస్తున్న రైలు చూడటంతో అదొకటే రైలు అనుకుంటారు. దానికి వ్యతిరేక దిశ నుండి మరొకటి వస్తుందని ఊహించరు. అటువైపు చూసిన ఒకరిద్దరు, గేట్ బయట ఉన్నవాళ్ళు, రైలు పట్టాలపైనున్న ఈ అమ్మాయిని చూస్తూ హాహాకారాలు చేస్తున్నారు. కాని రైలు శబ్దంలో, టెన్షన్‌లోఉన్న భావన చెవికి అవి సోకలేకపోయాయి. కళ్ళముందే ఆమె జీవితం 'ఔట్' అని అంతా అనుకున్నారు. కాని ఇంతలో గేట్ బయటనున్న ఒక యువకుడు స్పీడ్‌గా, అతని చేతిలోని వెహికిల్ ఎలా ఉన్నది అలా ఒదిలేసి, గేట్ క్రిందినుండి దూరి బలంగా కుడి చేత్తో ఆమె చేతిలోని బండి వెనక భాగాన్ని గట్టిగా వెనక్కి లాగి, ఎడమ చేత్తో ఆమెను తన వైపు లాక్కున్నాడు. ఆమె ఆ విసురుకు వెహికిల్ వదిలేసి గుండ్రంగా తిరుగుతూ వచ్చి అతని కౌగిట్లో పడటం, స్కూటీ వెనక్కి వచ్చి క్రింద పడటం, రైలు పట్టాల పైనుండి రైలు వెళ్ళడం ఏక కాలంలో జరిగిపోయాయి.

ఆ రైలు వెళుతున్నంతవరకు జరిగిందేమిటో తెలియక భయంగా అతని కౌగిట్లో అలాగే కళ్ళు మూసుకుని ఉంది భావన. రైలు వెళ్ళగానే ఉలిక్కిపడి విడివడింది. జరిగిందేమిటో తెలిసిందామెకు. క్షణంలో ఎంత ప్రమాదం తప్పింది. ఇతనెవరో ధైర్యంచేసి తనను కాపాడకపోతే... తనకు ఈ క్షణంలో నూరేళ్ళు నిండేవి.

అందరూ 'ఏమిటంత తొందర...' 'ఆ అబ్బాయే లేకపోతే ఏమయ్యేది' 'ఒక్క నిమిషం ఆగలేవా...' 'ఈ కాలం పిల్లలంతా ఇంతే ఎందులోనయినా దూకుడే' అంటూ కామెంట్లు చేస్తుంటే, నిజంగా ఈ కాలం పిల్లలకు భిన్నమైన మనస్తత్వం గల భావన కళ్ళలో నీళ్ళు చిప్పిల్లగా నిరుత్తరురాలై నిల్చుండిపోయింది. అతనామె పరిస్థితి గమనించి దగ్గరకొచ్చి, ఆమె వెన్ను తడుతూ,

'రిలాక్స్... అలా ఒక్క క్షణం కూర్చుంటారా! ఏమీ కాలేదు కదా...' అంటూ పడి ఉన్న స్కూటీని లేవనెత్తి చూసాడు. క్రిందపడ్డ వైపు కొంచెం ఒరుసుకుపోయి గీతలు పడ్డాయి, తప్ప ఏం కాలేదు. అతను స్టార్ట్‌చేసి చూసాడు, ఆమె మౌనంగా అతని చేతినుండి తీసుకుంది. కనీసం థాంక్స్ చెప్పాలని కూడా తోచలేదామెకు. షాక్‌లో నుండి ఇంకా పూర్తిగా తేరుకోలేదు.

"మీరు వెళ్ళగలరా... నన్ను తీసుకురమ్మంటారా...' అడిగాడతను.

'లేదు... నే వెళ్ళగలను' అంటూ వెళ్ళింది భావన.

అతనికింకా ఆమె తనను కరుచుకుపోయిన భావన మదిలో మెదుల్తుంటే, చిరునవ్వు నవ్వుకుంటూ వెహికిల్ స్టార్ట్ చేసాడు.

'భావన ఆఫీసుకు రాగానే, ఆమె వాలకం చూసి 'ఏమిటే అలా ఉన్నావు' అంటూ అడిగింది ఆమె ప్రాణస్నేహితురాలు రాగవి.

జరిగింది చెప్పి, 'కనీసం అతనికి థాంక్స్ కూడా చెప్పకుండా వచ్చాను నా బుర్రేం పనిచేయలేదు' అంది భావన.

'పోనీలెద్దూ... నిజంగా ఎంత పెద్ద గండం నుండి బయటపడ్డావు. నువ్వు చేసే అన్ని మంచి పనులే నిన్ను ఈరోజిలా రక్షించాయి' అంది రాగవి. తర్వాత ఇద్దరూ పని హడావుడిలో పడిపోయారు. ఆరోజు సాయంత్రం గుడికెళ్ళి వచ్చింది భావన.

తెల్లవారి లేవగానే సెల్‌లో 'న్యూ మెసేజ్ రిసీవ్డ్' అని ఉంది భావన సెల్‌లో. ఏమిటోనని చూసింది, "Life will become 'LIE' if there is no friend like 'U'- friend అని ఉంది. 'ఎవరీ ఫ్రెండ్' ఎంత ఆలోచించినా అర్థంకాలేదామెకు. ఆ సెల్ నెంబర్ కూడా తనకు తెలిసిన ఎవరిదీ కాదు. తర్వాత పని హడావుడిలో దానినంతగా పట్టించుకోలేదు భావన.

ఆరోజు సాయంత్రం ఆఫీసులో పనవగానే, ముందనుకున్నట్లుగా రాగవితో కలిసి అనాథ శరణాలయానికి వెళ్ళి, తను ప్రతి నెల ఇచ్చే డొనేషన్ ఇచ్చి వస్తుంటే అంది రాగవి భావనతో. 'నాకు సంబంధాలు చూస్తున్నారు, మరి నువ్వెప్పుడు పెళ్ళిచేసుకుంటావే' అని. ఏం మాట్లాడలేదు భావన. ఎందుకంటే భావన అనాథ. ఆమెకెవరూ లేరు. ఎవరు చూస్తారు సంబంధాలు... ఆమె మనస్సర్థమయినట్లు అంది రాగవి, 'ఎవరు లేని వారికి దేవుడే దిక్కంటారు. ఇన్ని మంచి పనులు చేస్తున్న నీకు, ఆ భగవంతుడు తప్పక మంచి వరుణ్ణి చూపెడతాడు. పోనీ మా అన్నయ్యను చేస్కోకూడదూ... వాడివన్నీ నీ భావాలే... ఎంచక్కా ఎప్పటికీ ఇద్దరం కలిసి ఉండొచ్చు...''

'నోర్మూసుకోవే... ఎప్పటికీ ఒకటే గోల...' అంది భావన, రాగవి ఇంటిదగ్గర స్కూటీని ఆపుతూ...

'ఇవ్వాళ కూడా ఇంట్లోకి రావా...' అడిగింది రాగవి దిగుతూ.

'మరోసారెప్పుడైనా వస్తాలే చీకటి పడింది' ఎప్పటిలాగే అంటూ వెళ్ళింది భావన. తెల్లవారి భావన సెల్‌లో 'కైండ్‌నెస్ ఈజ్ ఎ లాంగ్వేజ్, విచ్ కెనాట్ బి ఎక్స్‌ప్రెస్‌డ్, బట్ కెన్ బి ఎక్స్‌పీరియన్స్‌డ్, ఆర్ఫనేజ్‌కి మీ డొనేషన్ హట్సాఫ్... ఫ్రెండ్' అన్న మెసేజ్ ఉంది. ఆశ్చర్యపోయింది భావన. ఎవరీ ఫ్రెండ్. తను చేసే పని వారికెలా తెలిసింది. ఆడా, మగా... ఈసారి కొంచెం దీర్ఘంగా ఆలోచించింది. తన ఫ్రెండ్సెవరైనా ఆట పట్టించడానికి చేసారా, అంటే ఆ సెల్ నెంబర్ ఎవరిదీ కాదు. టైం అవుతుండటంతో లేచింది భావన.

'భావనా... ఆ ముసలాడు ఎలా చూస్తున్నాడో చూసావా... ఏ ఏజ్‌లో ఉన్నా ఆడదంటే చాలు చొంగ కారుస్తాడు' అంది రాగవి.

'అబ్బా... ఎన్నిసార్లు చెప్పానే నీకు, అలా పెద్ద వాళ్ళని ముసలాడు అనొద్దని, మీ అమ్మా, నాన్నల వయసున్నాడు. వారినలా ఎవరైనా అంటే ఎంత కోపమొస్తుంది. పెద్దాయన అను, వృద్ధుడు అను... మన మాటల్లో మన సంస్కారం ఉట్టిపడాలి. నీ మానాన నువ్వు వెళ్ళక... అతనలా చూస్తున్న సంగతి నువ్వు అతనివైపు చూస్తేనేగా తెలిసింది...'

'అబ్బా... నీతో, మా అన్నయ్యతో ఇదే గోల. మాటలమధ్యలో 'సచిన్‌గాడు...' అంటూ 'ఇలా చేసాడని' ముచ్చట్లు పెడితే ఒక్కటిస్తాడు. 'గాడు' ఏమిటి, మంచిగా మాట్లాడలేవా అంటూ, ఏ ద్వాపర యుగంలోనో పుట్టాల్సిన వారు నవ్వింది రాగవి.

'సరేలే... మేమెప్పుడు పుట్టాలో తర్వాత లెక్కేద్దువు గాని, ఇవ్వాళ ఎక్కడికెళ్ళాలో గుర్తుందిగా...'

'ఆ... ఉందిలే... బ్లడ్ డొనేషన్, స్వచ్ఛంద సంస్థలో కళ్ళు లేని వారికోసం విరాళం'

'అంతేనా... ఇంకోటి మర్చిపోయావు...'

'ఏంటది...'



ఇంటి వైద్యం

★ మంజిష్ఠ- మంగకాయ చిద్ర మూలము, పాలకూర, మ్రాను పసుపు, (దారుహరిద్రా), గులాబి రేకులను కలిపి మెత్తగా నూరి అందులో మైనంచేర్చి పెదవులకు రాసిన పెదవులు అందంగా కనిపిస్తాయి.

'తుపాను బాధితులకోసం చందాలు, బట్టలు, వస్తువుల సేకరణ.'

'అబ్బా! తల్లీ... నీకు దేవుడు 48 గంటలు, నాలుగు చేతులు, నాలుగు కాళ్ళు ఇవ్వాల్సింది. ఒకేరోజు ఆఫీసు చూసుకుని, ఇన్ని పనులు చేయడం కుదురుతుందా! అని ఆ పని రేపటికి వాయిదా వేసుకున్నాంగా...'

తన బ్లడ్ గ్రూప్‌దే బ్లడ్ ఎవరికో కావాలని, ఆఫీసులో ఎవరో అనటంతో వెళ్ళి ఇచ్చి, రాగవి తోడొస్తే రూంకొచ్చి కాస్తంత తిని, నీరసంగా పడుకుండిపోయింది భావన.

తెల్లవారి రేడియోలో 'మంచిమాట' కార్యక్రమం వింటుంటే ఫ్రెండ్ గుర్తొచ్చి, సెల్ తీసి చూసింది. అందులో 'ఇట్స్ గ్రేట్ టు హావ్ ఎ కైండ్ హార్ట్ లైక్‌యు, హాట్సాఫ్ టు యువర్ బ్లడ్ డొనేషన్ అండ్ డొనేషన్' ఫ్రెండ్ అని ఉంది. తను చేసే ప్రతీ విషయం వీరికెలా తెలుస్తుంది. మళ్ళీ ఆశ్చర్యపోయింది భావన. ఎందుకో గాని ప్రొద్దుటే ఆ మెస్సేజ్ ఆహ్లాదంగా అన్పించింది. ఉత్సాహంగా అన్పించింది. 'పాత రక్తంపోయి, కొత్త రక్తం వచ్చినందుకేమో' అనుకుని నవ్వుకుంది.

ఆ రోజు ఆ చుట్టుప్రక్కల వారి దగ్గర తుఫాను బాధితులకోసం ధన వస్తు సేకరణ చేసి, ఆఫీస్ వాళ్ళ దగ్గర నుండి కూడా సేకరించినవన్నీ ఆఫీస్ అయిపోయాక రాగవితో కలిసి కలెక్టరాఫీసు దగ్గర ఇచ్చేసి వచ్చేసరికి రాత్రయింది భావనకి.

తెల్లవారి వచ్చిన మెసేజ్ చూడగానే అనుకుంది, అది ఫ్రెండ్‌నుండే అయి ఉంటుందని. 'లైఫ్ లాఫ్స్ ఎట్ యు వెన్ యు ఆర్ అన్‌హ్యాపీ', లైఫ్ స్మైల్స్ ఎట్ యు వెన్ యు ఆర్ హ్యాపీ; బట్ లైఫ్ సెల్యూట్స్ ఎట్ యు, వెన్ యు మేక్ అదర్స్ హ్యాపీ... 'చిన్న వయసులో తుఫాను బాధితులకు మీ సహాయం ప్రశంసనీయం...' అని ఉంది. 'ఎందుకో తాను ఒకరి మెప్పు పొందాలని చేయకపోయినా, ఒక అజ్ఞాత వ్యక్తినుండి వచ్చే ఈ సందేశాలు తనలో స్ఫూర్తిని నింపి, నూతనోత్సాహాన్ని కలిగిస్తున్నాయి' అనుకుంది భావన.

ఈరోజు ఆమెకు ఈ ఫ్రెండ్ ఎవరో తెలుసుకోవాలనే కుతూహలం ఎక్కువయ్యింది. తను చేసే పనులు, తన ఫ్రెండ్సందరికీ కూడా తెలియవు. రూంలో తనతోపాటు ఉండే మరో ఇద్దరు ఫ్రెండ్స్‌కి కూడా తెలియవు. పైగా ఆ సెల్ నెంబర్ తనకు తెలిసిన ఎవరిదీ కాదు. పైగా ప్రతీ మెస్సేజ్ తనకు వచ్చేది, ఎప్పుడూ రాత్రి 12 గంటలకే. ఎవరై ఉంటారో అర్థంకాలేదు. అందుకే ఒక రోజంతా, తను ఎటువెళ్ళినా ఎవరైనా గమనిస్తున్నారా అనుకుని ఆఫీసులో బయట అంతా గమనించింది. కాని అనుమానించదగ్గ వాళ్ళెవరూ కనిపించలేదు. పోనీ ఆ సెల్ నెంబర్‌కే ఫోన్ చేసి, మీరెవరు అని అడిగితే పోలా, కనీసం ఆడ, మగ అయినా తెలుస్తుందిగా అనుకుని ఆ నెంబర్‌కి ఫోన్ చేసింది. కాని అటు నుండి కట్ చేసారు. మరోసారి చేసింది. మళ్ళీ కట్ చేసారు. అంటే వారెవరికోగాని తనకు డీటెయిల్స్ చెప్పడం ఇష్టం లేదన్నమాట. మరిదంతా ఏం ఆశించి చేస్తున్నట్లు... సమాధానం ఎంత ఆలోచించినా దొరకలేదు.

ఆరోజు తెల్లవారి, 'విష్ యు మెనీ మెనీ హాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే'- ఫ్రెండ్; అని సెల్‌లో ఉన్న మెసేజ్ చూసి ఆశ్చర్యపోయింది భావన, వారికి తన పుట్టినరోజు సంగతెలా తెలిసిందని. ఆఫీస్‌కి కొరియర్ అతనొచ్చి ఒక పాకెట్, ఇచ్చి సంతకం తీసుకుని వెళ్ళాడు. తనకెవరు పంపిస్తారని ఆశ్చర్యంగా విప్పింది. లోపల ఫ్రెండ్ అంటూ సెల్ నెంబర్ వేసి ఉంది. ఇంకా తెరిచి చూస్తే గ్రీన్ కలర్ చీరపై కుందన్‌లతో, చమికీలతో వర్క్ చేసిన చీర, 'మండే', 'ట్యూస్‌డే' అంటూ ఏడు రోజులకు ఎంబ్రాయిడరీ చేసిన ఏడు తెల్లని కర్చీఫ్‌లు ఉన్నాయి. వాపస్ పంపడానికి లేదు. అలాగని తీసుకోవడానికి మనసొప్పలేదు. ఆఫీస్‌లో ఎవరికయినా తెలిస్తే, చిలవలు, పలవలు అవుతుందని, తర్వాత రాగవికి విషయం చెప్పాలనుకుని ఆ ప్లాస్టిక్ కవర్ దాటేసింది.

ఆ సాయంత్రం రాగవి త్వరగా వెళ్ళిపోవడంతో చూపించడం కుదరలేదు భావనకి. తెల్లవారి రాగవి ఆఫీస్‌కి రాలేదు. ఫోన్ చేస్తే, వాళ్ళన్నయ్య ఎత్తి జ్వరంగా ఉందని చెప్పాడు. ఆ మర్నాడు కూడా రాకపోయేసరికి,

> 'ఎందుకో తాను ఒకరి మెప్పు పొందాలని చేయక పోయినా, ఒక అజ్ఞాత వ్యక్తినుండి వచ్చే ఈ సందేశాలు తనలో స్ఫూర్తిని నింపి, నూతనోత్సాహాన్ని కలిగిస్తున్నాయి'



ఆఫీసయ్యాక సాయంత్రం సరాసరి ఆమె దగ్గరికే వెళ్ళింది. బయట వాళ్ళమ్మ కనబడి లోనికి తీస్కెళ్ళింది. లోన బెడ్‌పైన పడుకుని నిద్రపోతోంది రాగవి. వాళ్ళమ్మ లేపబోతుంటే కాస్సేపు కూర్చుంటానని, లేపవద్దని వారించింది భావన. కాస్సేపు మాట్లాడి, కాఫీ తేవడానికి లోనికెళ్ళింది రాగవి వాళ్ళమ్మ.

భావన కూర్చున కుర్చీ ముందున్న టిపాయ్‌పై సెల్ ఉంది. రాగవి సెల్‌లా లేదే అనుకుంటూ చేతిలోకి తీసుకుంది భావన. దానిపై ఉన్న సెల్ నెంబర్ చూసి అదిరిపడింది భావన. ఎందుకంటే ఆ సెల్ నెంబర్ ఆమెకు బాగా గుర్తు. ఆమెకొచ్చే మెస్సేజ్‌లన్నీ ఆ సెల్ నుండే వస్తున్నాయి. ఆ సెల్ రాగవి దగ్గర ఉండడమేమిటి, అంటే రాగవే తననిలా ఆటపట్టిస్తోందా, ఆలోచిస్తుంటే నిజమేననిపించింది. ఎందుకంటే తను చేసిన పనులన్నీ కేవలం ఒక రాగవికే తెలుసు. మరి తనతో ఒక్క మాట చెప్పలేదు. కనీసం తనకు అనుమానం కలిగేలా కూడా వ్యవహరించలేదు. తన అనుమానం నిజమా, కాదాని తన సెల్ నుండి, మెసేజ్ వచ్చిన సెల్ నెంబర్‌కి రింగ్ ఇచ్చింది. ఆమె మరో చేతిలో ఉన్న ఆ సెల్ రింగ్ అవుతోంది. మరి రాగవి సెల్ నెంబర్ వేరే కదా! ఇదెక్కడిది... తనకు తెలియకుండా మరో సెల్ ఉందా! రింగ్ కట్ చేసి మళ్ళీ ఇచ్చింది. మళ్ళీ మ్రోగుతోంది.

ఇంతలో లోపల్నుండి టవల్‌తో మొహం తుడుచుకుంటూ, వచ్చాడొక యువకుడు. ఆమె చేతిలో తన సెల్ చూసి అలాగే నిలబడి పోయాడు.

అతన్ని చూసి షాక్ తిన్నదామె. ఎందుకంటే అతను మరెవరోకాదు, తనను ఆరోజు రైలుపట్టాలపై నుండి రక్షించినవాడు, పదే పదే తనకు గుర్తొచ్చి తన మనస్సును కలవరపెడుతున్నవాడు.

అతను సెల్ రింగ్ అయ్యేసరికి వచ్చాడని అర్థం అయిందామెకు. అంటే ఆ సెల్ అతనిది అయి ఉంటుందని చూచాయగా తెలిసిందామెకు. మరి ఇతనిక్కడ ఎందుకున్నాడు... అదీ ఇంట్లో వేసుకునే డ్రెస్ మీద... ఓహో... అయితే ఇతనే రాగవి అన్నయ్య అయి ఉంటాడు. ఆమెకేదో చిక్కుముడి వీడుతున్నట్లనిపించింది. అవును... తను చేసే ప్రతీ పని రాగవికి మాత్రమే తెలుసు. మరి రాగవి తనతో ఒక్కమాట కూడా చెప్పలేదు. అదే విషయం బయటికి అంటూ, 'మీరేనా... మెస్సేజ్...' అంటూ ఆగింది.

ఇంటికొచ్చిన అతిథిని అలా అయోమయంలో ఉంచడం సంస్కారం కాదనుకున్నాడేమో, చిరునవ్వుతో నోరు విప్పాడతను, 'యస్... నేనే... ఈ విషయం ఏమాత్రం రాగవికి తెలియదు. ఆరోజు మిమ్మల్ని కాపాడాక, ఎందుకో మిమ్మల్ని మర్చిపోలేకపోయాను. అదే రోజు రాత్రి రాగవి 'మా ఫ్రెండ్‌కిలా జరిగింది...' అంటూ చెబితే, 'అయితే నే కాపాడింది తను ఎప్పటికీ బెస్ట్ ఫ్రెండ్ అని చెప్పే మిమ్మల్నేనన్నమాట' అనుకున్నాను. మీ పేరు కూడా తన ద్వారానే తెలిసింది. ఎప్పటికీ రాగవి మీతో పాటు అన్ని సేవా కార్యక్రమాలకు అటెండ్ అవుతూ ఉంటుంది, కాబట్టి ప్రతిరోజు సాయంత్రం, ఆరోజు ఎక్కడికెళ్ళింది, ఎవరితో వెళ్ళింది, ఏం చేసింది చెబుతూ ఉండేది. ఆమె సెల్‌నుండి మీ పేరుతో ఉన్న సెల్ నెంబర్ తీసుకున్నాను. ఎందుకో మీ భావాలు బాగానచ్చాయి. వృద్ధాశ్రమాలకు, అనాథ శరణాలయాలకు సహాయం చేయడం, ఆక్సిడెంట్ అయిన వారికి హెల్ప్ చేయడం, బస్‌లో వృద్ధులకు, మహిళలకు మీ సీట్ ఇవ్వడం, ఇతరుల బాధల్ని మీ బాధలుగా ఫీల్ కావడం, చిన్న విషయానికి కూడా అంటే సినిమాల్లో బాధలకు కూడా కదిలిపోతూ ఏడవడం లాంటి చాలా భావాలు, మీ సున్నితత్వం బాగా నచ్చాయి. ఎవరూ లేరనుకునే మీకోసం ఒకరున్నారనే సంతృప్తి కలిగించాలనుకున్నాను. అందుకే ఈ ఆలోచన వచ్చి అమలు పరిచాను. మీరు ఎక్కడ ఆ సెల్ నెంబర్ రాగవికి చూపిస్తారో అని భయపడ్డాను. కాని మీరు ఆ భావాలు ఎవరితో పంచుకోవడం ఇష్టం లేనట్లు, ఈ విషయం ఇంకా రాగవికి చెప్పలేదన్నది రాగవి మాటల ద్వారా తెలిసింది. 'రేపు మా భావన బర్త్‌డే... ఏ గిఫ్ట్ తీసుకెళ్ళాలి' అని ముందురోజే ఇంట్లో మీటింగ్ పెట్టింది రాగవి. నాకు మీకు గిఫ్ట్ ఇవ్వాలనిపించి పంపాను. రాగవికి జ్వరం రాకపోయినా, మీరీ సెల్ నెంబర్ చూడకపోయినా ఇంకొంతకాలం ఈ దాగుడుమూతలు సాగేవేమో... నేను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. మీకిష్టమైతే పెళ్ళిచేసుకుంటాను. మీకిష్టమైతే ఆలోచించుకుని, నా సెల్‌కి రింగ్ ఇవ్వండి, లేదంటే ఇప్పటితో ఈ సెల్ నెంబర్ మర్చిపోండి...' అతను అనగానే ఆమె బుగ్గలు గులాబీలయ్యాయి సిగ్గుతో.

ఇన్ని రోజులు ఆమెకు అతని గాఢ పరిష్వంగంలోని నిశ్చింత, పదే పదే గుర్తొచ్చేది. ఇపుడు అతడే తన ఎదుట నిలిస్తే మది మానసం, చెప్పాలనుకున్న ఊసులు మర్చి మూగబోయింది. అందుకే చేతిలోని సెల్ నుండి, అతని సెల్ నెంబర్‌కి రింగ్ ఇచ్చింది.

అది రిసీవ్ చేసుకున్న అతను, ఆమెను చూసి చిలిపిగా నవ్వాడు. దూరంగా గుళ్ళోని జేగంటలు 'తథాస్తు' అన్నట్లు మ్రోగాయి. ❂


<u>రచయిత</u> <u>చిరునామా:</u>

నామని సుజనాదేవి,

ఎల్.ఐ.సి. ఆఫ్ ఇండియా, అంబేద్కర్ స్టేడియం రోడ్,

బ్రాంచ్ ఆఫీస్-1, కరీంనగర్- 505001




ఇంటి వైద్యం

★ మంజిష్ఠము చక్కగా అతి చిక్కగా కాషాయం కాచి అందులో ఆవుపాలు, తేనె, మైనములను కలిపి ముద్దగా చేసుకొని దానిని పెదవుల మీద చక్కగా లేపనము చేసిన పెదవుల అందం పెరుగుతుంది.